4న వివేకానందనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ కమిటీ హాలులో సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షులు రోణంకి జగన్నాథం మాట్లాడుతూ..ఆగస్టు 4న ఉదయం 6:30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారని, 20న నామినేషన్ ఉపసంహరణ, 29న పోటీ చేసే అభ్యర్థుల ఓటర్ లిస్టును సిద్ధం చేయటం జరుగుతుందన్నారు. ఆగస్టు 2వ తేదీ వరకు ప్రచారం నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల అధికారిగా సామ కొండల్ రెడ్డి, సహాధికారులుగా పి. రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి, అప్పారావులను నియమించామని తెలిపారు. సమావేశంలో పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, కాయితి యాదవ్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, బుల్లి శ్రీను, చెవ్వూరి మధుసూదనాచారి, చిలుకల కృష్ణారెడ్డి, చెల్లయ్య, బొంత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధరణినగర్ సమస్యలు పరిష్కరిస్తాం

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ధరణినగర్‌లో డ్రైనేజీ, రోడ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వర్షానికి కూడా ముంపునకు గురయ్యే కాలనీని నేడు ఎంతో అభివృద్ధి చేశామని ఆయన గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్లను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, సీహెచ్. భాస్కర్, అగ్రవాసు, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, రెహమాన్, ప్రేమ్ దాస్, బాలస్వామి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నేత ముందస్తు అరెస్టు



ఆల్విన్‌కాలనీ: భూదేవి హిల్స్ కాలనీలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్‌ను జగద్గిరిగుట్ట పోలీసులు సీఎం పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఎలాంటి కార్యక్రమాలు లేకున్నా పోలీసులు ఇంటికి వచ్చి అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం అధికారిక కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్న భయంతో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని లేకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఎమ్మెల్యేను వివేకానందగర్‌కాలనీ వాకింగ్ గ్రూప్ సభ్యులు, కాలనీ వాసులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధికి బాసటగా నిలవాలన్నదే తన లక్ష్యం అని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారావు, కట్ట శ్రీనివాస్, కొండారెడ్డి, స్వరాజ్యం, బాలాజీ, సాయిప్రసాద్, ప్రకాష్, సుధాకర్‌రెడ్డి, సతీష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: సామాజిక స్పృహతో యువత మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు శివ చౌదరి, బచ్చు మల్లి, బాబ్జి ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని బండి రమేష్ ప్రారంభించారు. గామన్, నెక్స్‌జెన్ హాస్పిటల్స్ సౌజన్యంతో వైద్యులు షుగర్, బీపీ, సాధారణ వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. నిర్వాహకులు, వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్‌రెడ్డి, లక్ష్మణ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాదు ప్రతాప్‌రెడ్డి, రేష్మ, సుధ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి



ఆలయ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సీఐ నవీన్‌కుమార్

బాలానగర్: ఆషాఢ మాసం బోనాలు ఉత్సవం సందర్భంగా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సీఐ నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో వివిధ ఆలయాల ప్రతినిధులు, నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాన్నారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సరళ, పోలీస్ అధికారులు, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'బయో మెట్రిక్' హాజరు!



- ఈ నెలాఖరు లేదా ఆగస్టు నుంచి అమల్లోకి
- జీప్లస్ టూ పద్ధతిలో నిర్మించిన కలెక్టరేట్లో 86 గదులు
- విధుల నిర్వహణలో వివిధ శాఖలకు చెందిన దాదాపు 400 మంది ఉద్యోగులు
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రాక
- సమయం పాలన కోసమే బయోమెట్రిక్ విధానం

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ నెలాఖరు లేదా ఆగస్టు నుంచి ఈ తరహా హాజరు విధానాన్ని అమల్లోకి తేచ్చేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

◆ కలెక్టరేట్‌లోని దాదాపు 50 ప్రభుత్వం శాఖలు, విభాగాలు ఉండటంతో... దానికి తగ్గట్టుగా 6 నుంచి 10 వరకు బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటు చేయటంపై సమాలోచనలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల నేపథ్యంలో విధివిధానాలు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

◆ ఉద్యోగులు సమాచారాన్ని సేకరించటంతోపాటు.. పొందుపరిచే విషయాలపై శ్రద్ధ చూపుతున్నారు. ఉద్యోగుల హాజరు శాతాన్ని మెరుగు పరచటంతోపాటు విధుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించేందించటం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల పరిపాలనను గాడిలో పెట్టేందుకు అధికార యంత్రాంగం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

శాఖలకు కేంద్రం.. కలెక్టరేట్...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయం ప్రభుత్వ పాలనకు కేంద్ర బిందువుగా ఉండటంతో అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్యను బట్టి 6 నుంచి 10 బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

◆ ఇక మీదట కలెక్టరేట్లోని వివిధ శాఖలు, విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది పని దినాల్లో ప్రతి రోజూ ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటోంది. సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటోంది.

◆ శామీర్‌పేట మండలం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం జీ ప్లస్ టూ అంతస్తుల్లో కొనసాగుతోంది. ఇందులో దాదాపు 50 ప్రభుత్వ శాఖలు ఉండగా, 86 గదులు ఉన్నాయి.

◆ జిల్లా కలెక్టర్‌తోసహా ఇద్దరు జిల్లా అదనపు కలెక్టర్లు, డీఆర్వీఓ, వివిధ శాఖ జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పర్మనెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మొత్తం కలిపి దాదాపు 400 మంది పని చేస్తున్నారు. ఇక మీదట వీరి హాజరు విధానాన్ని బయోమెట్రిక్ పద్ధతిలో అమలు కానుంది.

కలెక్టరేట్ వెలుపలి

కలెక్టరేట్‌లో ఉన్న ఆయా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరుకు సంబంధించి బయోమెట్రిక్ విధానం అమల్లోకి రానుండటంతో వెలుపల ఉన్న శాఖల పరిస్థితి ఏమిటనే విషయంపై ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. కలెక్టరేట్ వెలుపల మేడ్చల్, మల్కాజిగిరి ఎక్సైజ్‌సూపరింటెండెంట్ కార్యాలయాలు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా అటవీ శాఖ కార్యాలయం, జిల్లా రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి.

సుదూర ప్రాంతం.. రవాణా వసతి లేకపోవటం...

కలెక్టరేట్లో పనిచేస్తున్న జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది జీహెచ్ఎంసీ పరిధితోపాటు రంగారెడ్డి జిల్లా తదితర ప్రాంతాలలో నివాసం ఉండటం వల్ల.. దాదాపు 60 కిలోమీటర్ల నుంచి 10 కిలోమీటర్ల నుంచి రావాల్సి ఉంటోంది. వీరు రోజూ రాకపోకలను కొనసాగించాలంటే సొంత వాహనం ఉంటే తప్ప సమయానికి కలెక్టరేట్‌కు చేరుకోలేని పరిస్థితి నెలకొని ఉంది. పైగా ఆర్టీసీ బస్సు సౌకర్యం అరకొరగా ఉంది. కలెక్టరేట్‌కు బస్సు రోజూ ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు మాత్రమే నడుస్తోంది. ఈ బస్సు మిస్సయితే... ఒక ఉద్యోగి రూ. 200 వెచ్చిస్తే తప్ప.. కలెక్టరేట్‌కు చేరుకోలేని పరిస్థితి. అయితే వివిధ శాఖల్లో పని చేస్తున్న పలువురు జిల్లా అధికారులకు వాహనాలు కూడా లేవు. ఒక్కోసారి రాత్రి 8 గంటల వరకూ కొంత మంది అధికారులు, ఉద్యోగులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుండటంతో వారు ఇంటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో బయోమెట్రిక్ అమల్లోకి ముందే.. బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉద్యోగుల వివరాలన్నీ...

కలెక్టరేట్‌లోని వివిధ జిల్లా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను బయోమెట్రిక్ మిషన్లలో నమోదు చేయాల్సి ఉంటోంది. దీంతో ఉద్యోగులు నిత్యం తమ వేలి ముద్రతో హాజరు వేయాల్సి ఉంటుంది.

◆ ఈ విధానం ఏళ్లుగా అమలులో ఉన్నప్పటికీ, ఆచరణకు నోచుకోలేదు. జిల్లా అధికారులు ఫీల్డ్ విజిట్ పేరుతో తమ కార్యాలయాలకు రావటంలో.. సమయ పాలన పాటించటం లేదని తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో ఆలస్యం అయిందనే నేపంతో అటునుంచి అటుగా ఇళ్లకు వెళ్లి పోతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరికొందరు ఉద్యోగులైతే సమయ పాలన పాటించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆఫీసు వేళలను పాటించటంలో కొంత మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరును పసిగట్టిన జిల్లా అధికార యంత్రాంగం బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు అస్కారం కల్పించినట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్‌వీ నేత హౌస్ అరెస్టు



నిఖిల్ కుమార్‌ను అరెస్టు చేసిన పోలీసులు

మూసాపేట: నగరంలో ముఖ్యమంత్రి కార్యక్రమం సందర్భంగా మూసాపేటలోని కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్‌ను ఆదివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని పలువురు అన్నారు.

గ్యార్వీ షరీఫ్ ఉత్సవం

మూసాపేట: మూసాపేట హెచ్‌పీ రోడ్డులోని దర్గా వద్ద ఆదివారం గ్యార్వీ షరీఫ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూసాపేట మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంషీగూడలో మొహర్రం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ దర్గాలో పీర్ల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు. డివిజన్ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా పండుగలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో అరుణ, గౌస్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢమాసం పూజలు



పూజలో పాల్గొన్న బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: ఆషాఢ మాసం పూజల్లో భాగంగా ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణాన్ని వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో శేరి సతీష్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా ఆరు గ్యారంటీల అమలు



శ్రీశైలంగౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సంజయ్‌గాంధీనగర్ బీఆర్‌ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: దశలవారీగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, విష్ణుగౌడ్, ఆంజనేయులుచారి, రాజలింగం తదితరులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటు పడిందని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కూన రఘుగౌడ్, నాయకుడు చౌడ శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, ఎస్‌సీయూఐ నాయకులు గొల్ల జాన్, నవీన్, సతీశ్ ఉన్నారు. అదే విధంగా స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంక్షేమ సంఘం నాయకులు శ్రీశైలంగౌడ్‌కు విన్నవించగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా వివిధ శుభ కార్యాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిజాంపేట్ కార్పొరేషన్ జర్నలిస్ట్‌కాలనీ సంఘం నాయకులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కమిటీ హాలు, పార్కు, ప్లేగ్రౌండ్‌తో పాటు చెర్ల ఎల్లమ్మ ఆలయం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గతంలో జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేశామని మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, గాజుల సుజాత, జర్నలిస్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆస్కాని మారుతీసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, కార్యవర్గ సభ్యులు జగదీశ్, వెంకట్, లింగస్వామి, సత్యనారాయణ, కృష్ణారావు, శ్రీనివాస్, మారుతి కుమార్, నరేంద్ర చారి, సుధాకర్ రెడ్డి, రాము యాదవ్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నిజాంపేట్ కార్పొరేషన్ జైదీపిక ఎస్టేట్స్‌లో జరిగిన జగన్నాథ రథ యాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. యాత్రలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కర్బారి, కార్యదర్శి సతీశ్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా..!



కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ ఉల్లంఘనులపై అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. జూలై 1న అల్వాల్ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాగరాజు ఆధ్వర్యంలో సుచిత్ర, దూలపల్లి, గుండ్లపోచంపల్లి, అల్వాల్ వెళ్లే రోడ్లలో డ్రంకన్‌డ్రైవ్‌లు నిర్వహించారు. గడిచిన 15 రోజుల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 180 మందిపై కేసులు చేశారు. అదేవిధంగా రాంగ్ రూట్లో వచ్చి ప్రమాదాలకు కారణమైన 68 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ నాగరాజు ×సాక్షి కి తెలిపారు. అలాగే నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 51 వాహనాలను సీజ్ చేసి చలాన్లు విధించినట్లు పేర్కొన్నారు. అలాగే ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా నడపకుండా 4 యూనియన్ సభ్యులను ఏకం చేసి దూలపల్లి, సుచిత్ర, జీడిమెట్ల ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచనలు చేసినట్లు తెలిపారు. ఇటీవల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించామని పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కృషి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సుచిత్రలోని ఆదిత్య హోమ్స్ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో కరెంటు తీగలు తగిలి గుడిసెలు కాలిపోయాయమని, అధికారులను పిలిచి వైర్లు ఎందుకు సరిచేయలేదని ప్రశ్నిస్తే తమ వద్ద నిధులు లేవన్నారని, రూ.10 వేల నిధులు వెచ్చించకపోవడంతో రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రంలో ఇలాంటి వందలాది గ్రామాలున్నాయని, తాను ఆర్థిక మంత్రి ఉన్నప్పుడు రూ. 100 కోట్ల బడ్జెట్ కేటాయించి అవన్నీ పూర్తి చేయించానని గుర్తు చేశారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణనలో ఇప్పుడున్న పరిస్థితులు చూస్తే బాధనిపిస్తుందన్నారు. కాగా ఈటల రాజేందర్ వెళ్లిన అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ హాజరు కావడం గమనార్హం. కార్యక్రమంలో అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి, ఉప్పల్ కమిషనర్ నరసింహ తదితరులు ఉన్నారు.



ఆదిత్య హోమ్స్ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ మల్లు రవికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



మూసాపేట: నాగర్‌కర్నూలు ఎంపీ డాక్టర్ మల్లు రవికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి ఆదివారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్కరించారు. కార్యక్రమంలో చంద్రి కొండల్ రెడ్డి, మాడుగుల సంతోష్, అశోక్ ముదిరాజ్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



ఆస్‌బెస్టాస్ కాలనీలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ ఆస్‌బెస్టాస్ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం రేణుకా ఎల్లమ్మ కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా బల్కంపేట ఎల్లమ్మను కాంగ్రెస్ వివేకానందనగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఉప్పల ఏకాంత్‌గౌడ్ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మోతీనగర్: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం..పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్యాంక్ కాలనీలోని భాగ్యనగర్ సొసైటీ, సర్వే నంబర్ 1007లో ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. మొబైల్ టీం ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుంది. లైట్ రెడ్, వైట్ కలర్ చెక్స్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. ఏఎస్ఐ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్, సెల్ నెంబర్ 8712663699లో సంప్రదించాలని కోరారు.